

మన జన ప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 251 | పేజీలు : 8 | వెల : రూ.2/- సోమవారం 05 అక్టోబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

ఆసియా క్రీడలకు ఘన ముగింపు

- 85 పతకాలతో నాలుగో స్థానంలో భారత్



2లో

ఉక్రెయిన్‌లో భారత ఫార్మా సంస్థపై

రష్యా డ్రోన్ దాడి

- ఒకరి మృతి.. భారీగా దెబ్బతిన్న కుసుమ్ గ్రూప్ ఔషధ తయారీ కేంద్రం



2లో



సూపర్ ఇంటెలిజెన్స్

ఫోర్స్ ఏర్పాటు

అమెరికా ఆధిపత్యమే లక్ష్యం.. ట్రంప్ కీలక నిర్ణయం

వాషింగ్టన్, మన జన ప్రగతి అక్టోబర్ 04: కృత్రిమ మేధస్సు రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్' పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

మిగతా2లో...

ప్రకృతి సాగులో ఏపీ దేశానికే ఆదర్శం

చంద్రబాబు ప్రోత్సాహం అభినందనీయం: కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



తెనాలి, మన జన ప్రగతి అక్టోబర్ 04: ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమని అన్నారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రైతు జానకీరామ్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కేంద్ర మంత్రి సందర్శించారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ప్రకృతి సాగు విధానం, పెట్టుబడి ఖర్చుల వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని

మిగతా2లో...



బడ్జెట్ అంచనాలకు దూరంగా తెలంగాణ రాబడులు

- మూడేళ్లుగా అంచనాల కంటే తక్కువగా వాస్తవ వసూళ్లు

హైదరాబాద్, మన జన ప్రగతి అక్టోబర్ 04: తెలంగాణ ప్రభుత్వ ఆదాయ వసూళ్లు బడ్జెట్‌లో వేసుకున్న అంచనాలకు గణనీయంగా దూరంగా ఉంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 202223 నుంచి 202425 వరకు వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లోనూ అంచనాల కంటే వాస్తవ రాబడులు

మిగతా2లో...

ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజాప్రతినిధులు విఫలం

- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అసమర్థులు
- బీజేపీ నేతలకు ప్రజా సమస్యలు పట్టవు
- రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలిన బీజేపీ ప్రజాప్రతినిధులు
- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఫైర్
- ప్రజల కోసం పనిచేయలేని బీజేపీ నేతలు
- బీజేపీ ప్రజాప్రతినిధుల తీరుపై మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజం



హైదరాబాద్,మన జన ప్రగతి అక్టోబర్ 04: బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యా రని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించి నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు సాధించాల్సిన బాధ్యత బీజేపీ ప్రజాప్రతినిధులపై ఉందని, అయితే వారు ఆ బాధ్యతను విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులపై

మిగతా2లో...

తెలంగాణలో శ్వేత విప్లవానికి

అమూల్ ఊతం

- రూ.400 కోట్లతో సాబర్ డెయిరీ ప్లాంట్.. 18 నెలల్లో పూర్తి చేస్తాం: కిషన్‌రెడ్డి

మెదక్, మన జన ప్రగతి అక్టోబర్ 04: పాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ముందంజలో ఉందని, తెలంగాణ కూడా శ్వేత విప్లవంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో అమూల్ సంస్థకు చెందిన సాబర్ డెయిరీ అత్యాధునిక పాల పరిశ్రమకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ముఖాముఖి నిర్వహించి పాడి రంగ అభివృద్ధి, సహకార వ్యవస్థ బలోపేతంపై మాట్లాడారు. రూ.400 కోట్లతో భారీ పరిశ్రమ

మిగతా2లో...



ఏపీలో గృహ నిర్మాణ రంగంలో

నూతన శకం

- 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం..
- 3డీ కాంక్రీట్ ప్రింటింగ్‌తో కొత్త విధానం: పవన్ కల్యాణ్



గుంటూరు,మన జన ప్రగతి అక్టోబర్ 04: ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ రంగంలో నూతన, వినూత్న శకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ్ 2.0 కింద రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం కీలక ముందడుగని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఈ గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యతను పెంచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నా మని పవన్ కల్యాణ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా గ్రామీణ గృహ నిర్మాణంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో ఈ సాంకేతికతతో 177 ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. పది రోజుల్లో ఇల్లు నిర్మాణం 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ విధానంతో ఒక్కో ఇంటి నిర్మాణాన్ని సుమారు పది రోజుల్లోనే పూర్తి చేసే అవకాశం ఉంటుందని

మిగతా2లో...



ఎస్ఎల్‌బీసీ పనుల్లో వేగం.. 2028 జూన్ నాటికి నీటి లక్ష్యం

- షియర్ జోన్‌ను దాటి ముందుకు సాగుతున్న టన్నెల్ పనులు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్,మన జన ప్రగతి అక్టోబర్ 04: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన ప్రాంతాలను అధిగమిస్తూ పనులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. 2028 జూన్ నాటికి ఎస్-ఎల్‌బీసీ ద్వారా నీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. టన్నెల్ నిర్మాణంలో ప్రమాదకరమైన షియర్ జోన్‌ను విజయవంతంగా దాటి తవ్వకాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గత ఆరు నెలల కాలంలో సుమారు 700 మీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులు, గతంలో

మిగతా2లో...

కులగణన కోసం ప్రజా ఉద్యమం

- బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులుద కల్పించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, మన జన ప్రగతి అక్టోబర్ 04: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కులగణన కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత

మిగతా2లో...

తెలంగాణలో శ్వేత విప్లవానికి అమూల్ ఊతం

(మొదటి పేజీ తరువాయి)

తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో సాబర్ డెయిరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్న ఈ పరిశ్రమను 18 నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. స్థానికంగా పాడి రైతుల నుంచి పాలను సేకరించి వాటికి విలువ జోడించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా ఈ పరిశ్రమ దోహదపడుతుందని వివరించారు. ప్లాంట్ ద్వారా పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పనీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి తదితర పాల ఉత్పత్తులను తయారు చేయనున్నారు. పాలకు స్థానికంగానే విలువ జోడించి మార్కెటింగ్ చేయడం వల్ల పాడి రైతులకు మరింత మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు.**రైతులు సహకార సంఘాలుగా ఏర్పడాలి** గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార వ్యవస్థ ఎంతో కీలకమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో రాజకీయ జోక్యంతో బలహీనపడిన సహకార సంఘాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులంతా కలిసికట్టుగా పాల సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు పొందాలని సూచించారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతులే సంఘాల ద్వారా పాలు సేకరించి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేపట్టే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.

తెలంగాణలో 1,525 కొత్త పాల సహకార సంఘాలు దేశవ్యాప్తంగా శ్వేత విప్లవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. 2029 నాటికి దేశంలో 75 వేల కొత్త పాల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వీటి ద్వారా పాడి రైతులకు మార్కెట్ అవకాశాలు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అన్నారు.**మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు** సాబర్ డెయిరీ ప్లాంట్ ఏర్పాటుతో స్థానిక యువతతో పాటు మహిళలకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కిషన్‌రెడ్డి తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులకు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయ మార్గం ఏర్పడుతుందని చెప్పారు. మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని పశువులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని సూచించారు. దీనివల్ల మహిళల ఆర్థిక స్వావలంబనకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.

పరిశ్రమలకు పూర్తి సహకారం తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో డెయిరీ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అమూల్ సంస్థకు తెలంగాణలో మంచి అవకాశాలు ఉన్నాయని, పాడి రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.సాబర్ డెయిరీ ప్లాంట్ ఏర్పాటుతో మెదక్ జిల్లాలో పాడి రంగానికి కొత్త ఊపు వస్తుందని, రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని ప్రజాప్రతినిధులు, అధికా రులు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో శ్వేత విప్లవాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ పరిశ్రమ కీలక మైలురాయిగా నిలుస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా నిర్మాణ సమయం తగ్గడంతో పాటు నిర్మాణ వ్యర్థాలు కూడా తగ్గుతాయని చెప్పారు. నాణ్యత, నిర్మాణ సామర్థ్యం మరింత మెరుగుపడుతాయని వివరించారు. ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే ఆధునిక సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.**పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం**ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన శాశ్వత నివాసం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నామని చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పేదల కోసం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గ్రామీణ గృహ నిర్మాణంలో మరిన్ని వినూత్న విధానాలను అమలు చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నిర్మాణంలో సాంకేతికతకు ప్రాధాన్యంకూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగంగా ముందుకు తీసుకెళ్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. సాంకేతికతతో విస్తృతిని, నాణ్యతతో వేగాన్ని, వినూత్న విధానాలతో సంక్షేమాన్ని మేళవిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా నిర్మించే ఇళ్లకు తక్కువ సమయంలో నిర్మాణం పూర్తవడంతో పాటు శ్రమ, నిర్మాణ వ్యయం, వ్యర్థాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

గుంటూరు జిల్లాలో చేపడుతున్న ప్రయోగాత్మక ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు.

గ్రామీణ ఏపీ అభివృద్ధికి కొత్త పునాది పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రతి కుటుంబానికి ఒక నీడ, ప్రతి ఇంటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికత, గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన పునాది అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

ఎస్ఎల్‌బీసీ పనుల్లో వేగం.. 2028 జూన్ నాటికి నీటి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎదురైన సాంకేతిక సమస్యలు, పనుల్లో ఏర్పడిన అంతరాయాలను అధిగమిస్తూ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.మొత్తం 43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటికే సుమారు 79 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ఇంకా 9.1 కిలోమీటర్ల మేర పనులు మిగిలి ఉన్నాయని చెప్పారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులు, ఇంజినీర్లకు తగిన సూచనలు చేస్తున్నట్లు తెలిపారు.


ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే నల్లగొండతో పాటు పరిసర ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా 30 టీఎంసీలకు పైగా నీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు కూడా ప్రాజెక్టు దోహదపడుతుందని చెప్పారు.టన్నెల్ పనుల్లో భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాంకేతిక నిపుణుల సూచనల మేరకు ఆధునిక పద్ధతులను వినియోగిస్తూ పనులు చేపడుతున్నట్లు వివరించారు. నిర్మాణ సమయంలో కార్మికులు, ఇంజినీర్ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంత రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు, రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

వెయ్యి రోజులు దాటినా ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు

● కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు..

మైనారిటీల సంక్షేమంపై నిలదీత



సిద్దిపేట జిల్లా,మన జన ప్రగతి అక్టోబర్ 04: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు దాటినా వాటిని ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు.గజ్వేల్‌లో నిర్వహించిన తెలంగాణ తురక కాశ సంక్షేమ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు 90 మంది కాశ కార్మికులకు రాతి కోత యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు ప్రతి సంవత్సరం రూ. 4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి రూ. 1,800 కోట్ల వరకు ఖర్చు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కేటాయింపులు, ఖర్చులను తగ్గించిందని ఆరోపించారు.**మైనారిటీ సంక్షేమంపై ప్రశ్నలు** మైనారిటీ గురుకులాల నిర్వహణ సక్రమంగా లేదని హరీశ్‌రావు ఆరోపించారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, విదేశీ విద్య కోసం మైనారిటీ విద్యార్థులకు అందాల్సిన ఉపకార వేతనాలు సకాలంలో అందడం లేదని అన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ఉద్యోగులకు నెలలుగా, ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు ఏడాదిగా జీతాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

కవితో తెలంగాణ అల్లాడుతోంది..

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

● కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలి: కవిత



హైదరాబాద్,మన జన ప్రగతి అక్టోబర్ 04: తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షు రాలు కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.తక్షణమే కరువు మండలాలను ప్రకటించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని కవిత డిమాండ్ చేశారు. ప్రత్యేక మంత్రివర్గ సమావేశం నిర్వహించి కరవు పరిస్థితులపై సమగ్రంగా చర్చించాలని కోరారు. భూగర్భ జలాలు పడిపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని పేర్కొన్నారు.కృష్ణా జలాల వినియోగం, సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితుల్లో రైతులకు, భూగర్భ జలాల పెంపునకు ప్రయోజనం కలిగేదని కవిత పేర్కొన్నారు.

ఆసియా క్రీడలకు ఘన ముగింపు

నాగోయా, మన జన ప్రగతి అక్టోబర్ 04:జపాన్‌లోని ఐచినాగోయాలో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగిన 20వ ఆసియా క్రీడలు ఆదివారం ఘనంగా ముగిశాయి. నాగోయా సిటీ మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో క్రీడాకారుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి మొత్తం 85 పతకాలు సాధించారు. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. షూటింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, హాకీ, ఆర్చరీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు సత్తా చాటారు.ముగింపు వేడుకల్లో తదుపరి ఆసియా క్రీడల ఆతిథ్య బాధ్యతలను ఖతార్‌కు అప్పగించారు. 2030లో 21వ ఆసియా క్రీడలు దోహాలో జరగనున్నాయి. క్రీడాస్ఫూర్తి, అద్భుత ప్రదర్శనలతో సాగిన ఐచినాగోయా ఆసియా క్రీడలు ఘనంగా ముగిశాయి.

ఉక్రెయిన్‌లో భారత ఫార్మా సంస్థపై రష్యా డ్రోన్ దాడి

సుమీ, మన జన ప్రగతి అక్టోబర్ 04:ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంలో భారత మూలాలున్న కుసుమ్ గ్రూప్‌కు చెందిన ఔషధ తయారీ కేంద్రంపై రష్యా డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడినట్లు సమాచారం. డ్రోన్ దాడిలో ఫార్మా సంస్థ ప్రధాన భవనం భారీగా దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి.ఈ దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. సైనిక స్థావరం కాని ఔషధ సంస్థను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఔషధాలు, వైద్య సామగ్రి నిల్వ చేసే కేంద్రంపై దాడి జరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.కుసుమ్ గ్రూప్ 1994లో భారతదేశం నుంచి ఉక్రెయిన్‌కు ఔషధాల ఎగుమతులతో కార్యకలాపాలు ప్రారంభించింది. 2009లో సుమీలో ఔషధ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తాజా దాడితో సంస్థకు భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. నష్టం విలువ కనీసం రూ.400 కోట్ల వరకు ఉండొచ్చని అంచనాలు వెలువడ్డాయి.

సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతలో అమెరికా ముందంజలో ఉండేలా ఈ బృందం పనిచేయనుంది.ఈ ప్రత్యేక బృందానికి నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జే క్లేటన్ నేతృత్వం వహించనున్నారు. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ చైర్మన్ ఆండ్రూ ఫెర్గూసన్, రక్షణ శాఖకు చెందిన ఉన్నతాధికారులు సహా పలువురు ఇందులో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ బృందం నేరుగా అధ్యక్షుడు ట్రంప్, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌కు నివేదించనుంది.ప్రపంచ సూపర్ ఇంటెలిజెన్స్ రంగంలో అమెరికా నాయకత్వాన్ని కొనసాగించడం, సాంకేతికతను ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించడం ఈ బృందం ప్రధాన లక్ష్యమని ట్రంప్ తెలిపారు. కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో చైనాతో పోటీ నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పురోగతికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించడంపై బృందం దృష్టి పెట్టనుంది.

ప్రకృతి సాగులో ఏపీ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

చౌహాన్ తెలిపారు. బీజామృతం, జీవామృతం వంటి సహజ పద్ధతులతో సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. ప్రకృతి సాగును ప్రోత్సహించడం ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాల్లో భాగమని తెలిపారు.ప్రకృతి పద్ధతిలో ఎకరా వరి సాగుకు సుమారు రూ.7 వేలు మాత్రమే ఖర్చవుతోందని రైతు జానకీరామ్ తెలిపారు. రసాయన ఎరువులతో సాగు చేస్తే దాదాపు రూ.25 వేల వరకు ఖర్చవుతుందని వివరించారు. ప్రకృతి సాగుతో పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పంటలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోందని చెప్పారు.

బడ్జెట్ అంచనాలకు దూరంగా తెలంగాణ రాబడులు

(మొదటి పేజీ తరువాయి)

తక్కువగా నమోదయ్యాయి.202223లో ప్రభుత్వం రూ.1.93 లక్షల కోట్ల రాబడిని అంచనా వేయగా.. వాస్తవంగా రూ.1.59 లక్షల కోట్లు మాత్రమే సమకూరాయి. 202324లో రూ.2.16 లక్షల కోట్ల అంచనాకు గాను రూ.1.69 లక్షల కోట్లు, 202425లో రూ.2.21 లక్షల కోట్ల అంచనాకు గాను రూ.1.67 లక్షల కోట్ల రాబడి మాత్రమే నమోదైంది.ప్రధానంగా కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, సహాయ నిధులు, అలాగే పన్నేతర ఆదాయాల్లో అంచనాలువాస్తవ వసూళ్ల మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. 202425లో గ్రాంట్ల రూపంలో రూ.21,636 కోట్ల రాబడిని అంచ నా వేయగా.. రూ.7,913 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. పన్నేతర ఆదాయంలోనూ అంచనా లకు అనుగుణంగా వసూళ్లు జరగలేదు.వరుసగా అంచనాలు, వాస్తవ రాబడుల మధ్య వ్యత్యాసం కొన సాగడం రాష్ట్ర ఆర్థిక నిర్వహణపై ప్రభావం చూపే అంశంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్స రానికి కూడా తెలంగాణ ప్రభుత్వం రూ.2.41 లక్షల కోట్ల రెవెన్యూ రాబడిని అంచనా వేసింది.

ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజాప్రతినిధులు విఫలం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ నేతల తీరును ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

కులగణన కోసం ప్రజా ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీల బహిరంగ సభలో మంత్రి పొల్గొని మాట్లాడారు.తెలంగాణలో ఇప్పటికే సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించి వివరాలను సేకరించామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కిస్తేనే వారికి విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యంలో సముచిత అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో బీసీ, ఓబీసీలకు ప్రత్యేకంగా కాలమ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కోరిందని మంత్రి తెలిపారు. గతంలో సరైన కుల వివరాల నమోదు లేకపోవడంతో సేకరించిన సమాచారం ఉపయోగపడని పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్‌లో అలాంటి సమస్యలు రాకుండా శాస్త్రీయ పద్ధతిలో కులాల వారీగా జనాభాను నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు.బీసీల హక్కుల కోసం ప్రజలు, బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు కలిసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జనాభా లెక్కలు స్పష్టంగా ఉంటేనే సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమ విధానాలను సమర్థంగా అమలు చేయగలమని ఆయన పేర్కొన్నారు.

వేంపల్లెలో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 04:- స్థానిక సాయి నగర్లో వెలసిన శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఈనెల 11వ తేదీ నుండి 20వ తేది వరకు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. దుర్గమ్మ దగ్గర ఆలయ అర్చకులు శాకల్య విష్ణుశర్మ ఆహ్వాన పత్రికలను పూజించి అనంతరం ఆవిష్కరించారు.అనంతరం ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో పది రోజులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించనున్నారు.ఉత్సవాల్లో దుర్గమ్మ తల్లిని 10 రోజుల పాటు వివిధ అవతారాల్లో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.అక్టోబర్ 20వ తేదీన శమీదర్శనం అనంతరం అంగరంగ వైభవంగా మంగళవాయిద్యాల నడుమ బాణసంచాలతో దుర్గమ్మ గ్రామోత్సవం నిర్వహించబడుతుందన్నారు.

వైకాపా కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

- వైకాపా గ్రామ కమిటీల గుర్తింపు కార్డులు పంపిణీ



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 04:- వైకాపా పార్టీ కార్యకర్తలు అందరూ ఐక్యతతో పనిచేస్తూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని వేంపల్లె మండలం వైసిపి కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, మాజీ జడ్పీటిసి ఎం.రవికుమార్ రెడ్డి లు కోరారు . ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీల గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి క్యాడర్ ని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్టానం ప్రత్యేక గుర్తింపు కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో నిబద్ధత కలిగిన కార్యకర్తలను గుర్తించి, వీరికి గుర్తింపు కార్డుతో పాటు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత అధికారులచే కుల దృవీకరణ పత్రాలు, ఇంటిపన్ను, ప్రభుత్వ పరమైన ఇతరత్రా బకాయిలు లేకుండా నిరభ్యంతర పత్రాలు ముందుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్, ప్రచార కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిసార్ బాషా, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కటిక చంద్రశేఖర్, నాయకులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సవిత



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి అక్టోబర్ 04:-ప్రొద్దుటూరులో ఈ నెల 5న జరగనున్న జలజీవన్ మిషన్ ప్రారంభోత్సవ బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జనసేన నాయకుడు రమణ తదితరులతో కలిసి సభా ప్రాంగణం, పార్కింగ్, రవాణా, ట్రాఫిక్, భోజనం, వైద్య, వసతి, మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసిందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీటిని సమృద్ధిగా అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.30 వేల కోట్లతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు కార్యక్రమానికి హాజరవుతున్నారని మంత్రి తెలిపారు. సభకు సుమారు లక్ష మంది వరకు ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ కడప జిల్లాలో విమానాశ్రయ టెర్మినల్ విస్తరణతో పాటు ‘స్టార్టప్ కడప’, ‘ఇన్వెస్ట్ కడప’, స్మార్ట్ కిచెన్స్, మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని మంత్రి వివరించారు. రాయలసీమను ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసి, పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని మంత్రి సవిత తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో భారీ భద్రత!

ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు
ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసుల సూచన



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి అక్టోబర్ 04:- రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో పట్టణ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ప్రొద్దుటూరులో జరిగే జల జీవన్ మిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. ముఖ్యుల పర్యటన సందర్భంగా భద్రతతో పాటు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. **జమ్మలమడుగుమైదుకూరు హైవేపై ఆంక్షలు**ప్రజలు, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని జమ్మలమడుగుమైదుకూరు హైవేపై సోమవారం ఉదయం 7 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఈ సమయంలో సాధారణ వాహనాలను నిర్దేశించిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నారు. **వాహనాల మళ్లింపు**కడప, మైదుకూరు వైపు నుంచి ప్రొద్దుటూరు పట్టణంలోకి వచ్చే సాధారణ వాహనాల రాకపోకలను ముందుగా నిర్ణయించిన సర్కిళ్ల మీదుగా ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించను న్నట్లు పోలీసులు తెలిపారు. పర్యటన పూర్తయ్యే వరకు వాహనదారులు పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఆంక్షలు ఉన్న మార్గాల్లో ప్రయాణించకుండా ముందస్తుగా తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవా లని ఏఎస్పీ విభూ కృష్ణ సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా ముఖ్యమైన కూడళ్ల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

కోర్టు భవనాలు పగలగొట్టేంత అద్వాన్న స్థితిలో లేవు

కోర్టు భవనాలను పరిశీలించిన కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్. రామ్ గోపాల్.



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 04:- రాయచోటి పాత కోర్టు భవనాలను కూల్చివేసి అదే స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని వచ్చిన ప్రతిపాదనను పరిశీలించడానికి కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్ రామ్ గోపాల్ ఆదివారం ఉదయం 11 గంటలకు రాయచోటి కోర్టు భవనాల వద్దకు వచ్చి పరిశీలించారు. కోర్టు భవనాలను పరిశీలించిన అనంతరం ఆయన ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. భవనాలు కూల్చే అంతగా అద్వాన్న స్థితిలో లేవని మైనర్ రిపేర్లు చేస్తే మరో 20 సంవత్సరాలు పాటు పాత బిల్డింగ్ లోనే రాయచోటి కి సంబంధించిన మూడు కోర్టులను జరపవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు రోడ్లు భవనాల శాఖ డి. ఈ. ని పిలిపించి బిల్డింగ్ పనికిరాదని ఎవరు సర్టిపై చేశారని ఆరా తీశారు. అవసరమైతే రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఒక ప్రత్యేక టీం ద్వారా మరింత లోతుగా బిల్డింగ్ పై అధ్యయనం చేయించి రిపేర్లు చేయించిన అనంతరం ఐదవ జిల్లా జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇక్కడే జరిగే విధంగా ఏర్పాట్లు చేసుకుందామని రాయచోటి న్యాయవాదు లతో ఆయన అన్నారు. అవసరం అనుకుంటే ప్రస్తుతం నూతన బిల్డింగ్ లో జరుగుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనంలో ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టును జరుపుకుందామని న్యాయమూర్తి అన్నారు. పూర్తి సమాచారంతో న్యాయవాదులు ఒక రిప్రజెంటేషన్ ఇవ్వాలని ఆయన సూచించారు. **ఈ స్థలం కోర్టుకు పనికిరాదు**నూతన కోర్టు భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం కేటాయించామని చెబుతున్న వరిగ గుట్టల్లో రాయచోటికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్ రామ్ గోపాల్ పరిశీలించారు. భవనాల నిర్మాణం కంటే చదును చేయడానికి ఎక్కువ బడ్జెట్ అవసరం అవుతుందని రాయచోటికి దూరంగా ఉండే ఈ ప్రాంతం లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవని ఇది కోర్టుకు అనుకూల మైన ప్రాంతం కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంట రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జ్ సుమల త, సీనియర్ సివిల్ జడ్జ్ ప్రసూన, జూనియర్ సివిల్ జడ్జ్ సుయోధన, లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి భాష, ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శి సిద్దయ్య, ట్రెజరర్ ఖుష్బూ, స్పోర్ట్స్ సెక్రటరీ టీవీ రమణ, రాయచోటి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎన్ ప్రభాకర్ రెడ్డి, భారత న్యాయ వాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెం ట్ టి.ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆనంద్ కుమా ర్, రాయచోటి ఐ ఏ ఎల్ అధ్యక్షులు యు. ధనుంజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏం.ఖాదర్ బాషా న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు

బీసీ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు రాగానే
మున్సిపల్ ఎన్నికలు



● ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తాం: మంత్రి నారాయణ

నెల్లూరు, మన జనప్రగతి, అక్టోబర్ 04:- రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.నెల్లూరు పర్యటనలో మున్సిపల్ ఎన్నికలపై మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆదేశించారని తెలిపారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, తీర్పు వచ్చిన అనంతరం ఎన్నికల ప్రక్రియ వేగవంతమవుతుందని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి సుమారు రూ. 12 వేల కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగని పక్షంలో ఆ నిధులు అందే పరిస్థితి ఉండదని అన్నారు. ఎన్నికల నిర్వహణకు వివిధ అంశాల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. **23 మున్సిపాలిటీలకు నష్టం** గతంలో 23 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా అందలేదని నారాయణ తెలిపారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.వార్డుల విభజన, రిజర్వేషన్లు ఈసీ పరిధిలో వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం ఎన్నికల ప్రక్రియ మరింత వేగం పుంజుకు ంటుందని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికలను కూడా విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్ జయకృష్ణ



తిరుపతి మన జనప్రగతి అక్టోబర్ 04: నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో అక్టోబర్ 5 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-222 7208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశా రు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.


వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రమేష్



తిరుపతి, మన జనప్రగతి అక్టోబర్ 04:- రాష్ట్ర గ్రామ రెవిన్యూ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలో విఆర్ఓగా పనిచేస్తున్న పతి పుత్తూరు రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం విజయవాడలోని రెవెన్యూ భవన్లో జరిగిన రాష్ట్ర విఆర్ఓ ల అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో రమేష్ ను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా నుంచి రమేష్ కు రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వీఆర్వోగా జిల్లాలో తన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ లో చోటు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని వీఆర్వోల పదోన్నతులు, వారి సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ తరపున శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తనను ఎన్నుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్వోలపై పెరుగుతున్న పని ఒత్తిడి లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చొరవ చూపుతానని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన రమేష్ తెలిపారు. రమేష్ ను నియమించడం పట్ల తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని విఆర్వోల సంఘం ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ధర్మవరం యువతకు ఉచిత డిఫెన్స్ శిక్షణ

- ప్రతి ఏటా 100 మందికి అవకాశం



ధర్మవరం, మన జనప్రగతి, అక్టోబర్ 04:-ఆర్మీ, పోలీస్, పారా మిలిటరీ వంటి రక్షణ, భద్రతా రంగాల్లో ఉద్యోగాలు సాధించాలనుకునే ధర్మవ రం నియోజకవర్గ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవ తీసుకున్నట్లు ఆయన కార్యాలయం తెలిపింది. సంస్కృతి సేవా సమితి సహకారంతో తిరుపతికి చెందిన ఎస్వీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొంది. ప్రతిభ, అర్హత ఉన్న యువతకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో శారీరక దారుఢ్యం, పరుగు, రాత పరీక్షలు, ఎంపిక ప్రక్రియ తదితర అంశాల్లో శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఎస్వీ డిఫెన్స్ అకాడమీ ద్వారా ధర్మవరం ప్రాంత యువతకు అందించిన శిక్షణలో మంచి ఫలితాలు వచ్చాయని మంత్రి కార్యాలయం పేర్కొంది. ఇటీవల జరిగిన అగ్నివీర్ ఎంపిక ప్రక్రియలో ధర్మవరం నుంచి 236 మంది హాజరుకాగా, 220 మంది ఎంపికైనట్లు తెలిపింది. ఈ అనుభవాన్ని కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 100 మంది యువతను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొంది. దేశసేవ చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం సూచించింది. వివరాలకు మల్లిఖార్జున 7998256789, నరేంద్ర 9490442576.

ఉపాధి హామీ నిధుల్లో గోల్ మాల్

• 30 లక్షల పైగా బినామీ ఖాతాల్లోకి దారి మళ్లింపు



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 04:- గాలివీడు మండలంలో ఉపాధి హామీ నిధుల్లో జరిగిన గోల్ మాల్ పై విచారణ ప్రారంభమైంది. 2018 - 19 అప్పటి టీడీపీ ప్రభుత్వం లో ఈ పథకం కింద చెక్ డ్యాములు,డంపింగ్ యార్డులు, ప్లాంటేషన్లు వంటి పనులు చేపట్టారు. ఆ సమయంలో కొంత మేర నిధులను విడుదల చేసి మిగతా నిలిపేశారు .2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెండింగ్ నిధులను 2024 వరకు విడుదల చేయలేదు. 2004లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను 2025 ఆగస్టు లో విడుదల చేసింది. దాదాపు అన్ని పంచాయతీల్లో రూ.50 లక్షల పైగా విత్ హెల్డ్ నిధులు విడుదల చేసింది. అయితే ఆ నిధులను ఉపాధి సిబ్బంది రైతులకు ఇవ్వకుండా తమ సొంత ఖాతాలోకి మళ్లించినట్లు తెలుస్తోంది. 30 లక్షల పైగా కాజేసినట్లు తెలుస్తుంది. ఏపీవో సహకారంతో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు బినామీ పేర్ల మీద 20 వేల నుంచి 2 లక్షల వరకు ఖాతాల్లో జమ చేశారని ఆరోపణలు ఉన్నాయి. శనివారం ఇద్దరూ ఎస్ ఆర్ పి లు ఒక స్టేట్ మానిటర్ ఉపాధి కార్యాలయానికి చేరుకొని సమాచారాన్ని సేకరిస్తున్నారు.

ఉపాధ్యాయుని తీరుపై ఎంఈఓకు ఫిర్యాదు

- విద్యార్థినికి ప్రేమ పాఠాలు నేర్పుతున్న ఉపాధ్యాయుడు



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 04:- అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం వెలిగల్లు గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినితో బయాలజీ ఉపాధ్యాయుడు వాట్సాప్ చాటింగ్ చేస్తూ, ఫోన్లో మాట్లాడుతున్నారంటూ విద్యార్థిని తల్లి ఆరోపించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయుడి తీరుపై తల్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినా మార్పు లేదని ఆరోపిస్తూ గురువారం ఎంఈఓ పిల్లి నాగరాజుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంఈఓ పాఠశాలను సందర్శించి వాస్తవాలు తెలుసుకుంటామని తెలిపారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల ప్రవర్తనపై విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్న రేణుక యల్లమాంబ ఆలయం

- 11 నుంచి 20 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు



సిద్ధవటం, మన జనప్రగతి, అక్టోబర్ 04: - మండలంలోని మాచుపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ జగజ్జనని రేణుక యల్లమాంబ అమ్మవారి ఆలయం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి సుబ్బరాజు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, విశేష అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు మాచుపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఐ పెద్దయ్య నాయుడును కలిసిన టీడీపీ నేత మిద్దె వెంకటేష్ యాదవ్



పత్తికొండ మన జన ప్రగతి అక్టోబర్ 04:-పత్తికొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పెద్దయ్య నాయుడును ఆదివారం టీడీపీ నేత మిద్దె వెంకటేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జొన్నగిరి మాజీ సర్పంచ్ ఓబులేసు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కొత్తూరు శివరాముడు, కొత్తూరు చక్రపాణి, కొత్తూరు నాగరాజు, సంఘాల బాలన్న, మీసాల శేఖర్ తదితరులు సీఐని కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తెలుగుదేశం పార్టీ తరపున పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. పోలీసులు ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ, శాంతిభద్రతలను కాపాడి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. తద్వారా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జొన్నగిరి ఎస్సై ఎన్ సి మల్లికార్జున పాల్గొన్నారు

హార్టికల్చర్ హబ్‌తో రైతాంగానికి మేలు: కసిరెడ్డి వెంకట శివారెడ్డి



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 04:-
మదనపల్లిలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టడం రాయలసీమ రైతాంగానికి ఎంతో ప్రయోజనకరమైన నిర్ణయమని గాలివీడు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి అన్నారు. రాయలసీమ ఉద్యాన పంటలకు ప్రసిద్ధి చెందిందని, ఈ హబ్ ఏర్పాటుతో ఉద్యాన పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్ రంగాలకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉందన్నారు. రైతులకు కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలకు గాలివీడు మండలం టీడీపీ కుటుంబం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లిలో జరిగిన కార్యక్రమానికి గాలివీడు మండలం నుండి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారని తెలిపారు. టీడీపీ కార్యాలయ ఇన్‌చార్జి సాయన్న సాయినాథ్ రెడ్డి, నాయకులు లోకేష్ రెడ్డి, సీనియర్ కార్యకర్త మౌలాలి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వెంకట శివారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

వైద్య సేవలకు గుర్తింపుగా డాక్టర్ నరసింహకు ఘన సత్కారం

• ఇండియన్ మెడికల్ అవార్డు2026 అందుకున్న సందర్భంగా స్వగ్రామంలో అభినందన



సిద్ధవటం, మన జనప్రగతి, అక్టోబర్ 04:- సిద్ధవటం మండలానికి చెందిన ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ యం.పి. నరసింహ వైద్యరంగంలో విశేష సేవలకు గుర్తింపుగా ఇటీవల చెన్నైలో ఇండియన్ మెడికల్ అవార్డు2026 అందుకున్నారు. ఈ పురస్కారం అనంతరం తొలిసారిగా స్వగ్రామమైన మాధవరం1కు విచ్చేసిన సందర్భంగా ఆయనను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. మాధవరం1 గ్రామానికి చెందిన పద్మశాలి బహోత్తమ సంఘం ఆధ్వర్యంలో, శ్రీ భద్రావతి భావనారాయణ ఆలయ కమిటీ మరియు సమాజ సేవలో ముందుంటున్న మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో డాక్టర్ నరసింహను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. డాక్టర్ నరసింహ చేస్తున్న వైద్య సేవలకు గుర్తింపుగా స్వగ్రామం తరఫున సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి తన వృత్తి బాధ్యతల నుంచి సమయం కేటాయించి రెండు మండలాల ప్రజలకు, ముఖ్యంగా నిరుపేదలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. స్వగ్రామ ప్రజల పట్ల ఆయన చూపుతున్న సేవాభావం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వైద్యరంగంలో మరిన్ని విశేష సేవలు అందిస్తూ పేదల పట్ల ఇదే అంకితభావంతో కొనసాగాలని, స్వగ్రామంలో వైద్య సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. డాక్టర్ నరసింహ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. సన్మానానికి స్పందించిన డాక్టర్ యం.పి. నరసింహ మాట్లాడుతూ.. స్వగ్రామంలో తనకంటే పెద్దలు, గ్రామస్థులు తనను సత్కరించడం సొంత కుటుంబ సభ్యులు ప్రోత్సహించినంత ఆనందంగా ఉందన్నారు. ఎన్ని అవార్డులు, పురస్కారాలు అందుకున్నా తన సొంత మండలాలైన సిద్ధవటం, ఒంటిమిట్ట ప్రాంత ప్రజలకు తన వంతు వైద్య సేవలు అందించడంలో ఎప్పటికీ వెనుకడుగు వేయనని తెలిపారు. తన సేవలను గుర్తించి సత్కరించిన స్వచ్ఛంద సేవా సంస్థ, పద్మశాలి బహోత్తమ సంఘం ఆలయ కమిటీ సభ్యులు, ప్రతినిధులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభినందనలు, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహం, ప్రోత్సాహాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, పద్మశాలి బహోత్తమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామీణ గృహానికి సురక్షితమైన తాగునీటి అందించాలన్నదే చంద్రబాబు లక్ష్యం

• రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్బాషా



రాయచోటి టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 04:- హర్ ఘర్ జల్ ప్రతి ఇంటికి నీరు అందించాలన్నదే చంద్రబాబు నాయుడు ధ్యేయమని అందులో భాగంగా ఐదవ తేదీ జల జీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచ్చేయుచున్నారని గాజుల ఖాదర్బాషా తెలిపారు .రాష్ట్ర పార్టీ ఆదేశాను సారం వేముల మండలానికి జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ సభకు పరిశీలకులుగా నియమించారని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పులివెందుల ఇంచార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ సభకు ప్రతి మండలం నుండి భారీగా తరలి వెళుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి ఫంక్షనల్ హౌస్ హోల్డ్ టాప్ కనెక్షన్ ద్వారా వ్యక్తిగత కులాయి కనెక్షన్లను అందించడం జలజీవన్ మిషన్ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పరిశీలకులు ఆది సామకోటి.. సింహాద్రిపురం పరిశీలకులు ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ భాస్కర్ రెడ్డి అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డయ్య యాదవ్ వేముల మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య క్లస్టర్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి మరియు గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు

పార్టీ శ్రేణులను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటాం

● ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 04: పట్టణంలోని 11వ వార్డులో వైఎస్ఆర్‌సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షబ్బీర్ నివాసంలో ఆదివారం సాయంత్రం రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, నాయకులు,కార్యకర్తల మధ్య ఆత్మీయ అనుబంధమే పార్టీకి బలమని పేర్కొన్నారు.పార్టీ శ్రేణులను సొంత కుటుంబ సభ్యుల మాదిరిగా చూసుకుంటామని, కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వాములుగా ఉంటామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ పట్టణ కన్వీనర్ నవాజ్, నాయకులు జాకీర్, గౌస్ ఖాన్, నవరంగ్ నిస్సార్, యూసుఫ్, షఫీఉల్లా, నిస్సాన్,ఎస్ ఎస్ బాష,జయచంద్రా రెడ్డి,బసిరెడ్డి,సోనీరాజ్ ఖలీమ్, సైదియా నియాజ్, రూపేష్,రఫిక్, తదితరనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోండి: కమిషనర్ ఎం.జయకృష్ణ



తిరుపతి మన జనప్రగతి అక్టోబర్ 04:-నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. ఆదివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలను అధికారులు సిబ్బందితో కలసి పరిశీలించాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు ఉన్నాయా? నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను అధికారులు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే వెంటనే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా ఏవైనా నిర్మాణాలు జరిగినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఇంచార్జి డిసిపీ మూర్తి, టిఫివో వంశీ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయమే ధ్యేయం

- పులివెందుల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: బీటెక్ రవి



పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 04:- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సూచించారు. పులివెందుల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ నెల 5న ప్రొద్దుటూరులో రూ.30 వేల కోట్లతో చేపట్టనున్న జలజీవన్ తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో బీటెక్ రవి, పులివెందుల నియోజకవర్గ పరిశీలకుడు సామకోటి ఆదినారాయణతో కలిసి పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంపై చర్చించారు. అనంతరం రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థానాల్లో టీడీపీ, కూటమి అభ్యర్థుల విజయానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించి పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీటెక్ రవి సూచించారు.

పి.జి.ఆర్.ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, అక్టోబర్ 4 (మన జనప్రగతి):

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. ఈ నెల 5న సోమవారం ఉదయం 10 గంటల నుంచి మదనపల్లితో పాటు డివిజన్, మండల స్థాయిలో పి.జి.ఆర్.ఎస్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని, 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. తొలుత గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై జిల్లా కేంద్రంలోని పి.జి.ఆర్.ఎస్‌కు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి: వైఎస్ మనోహర్ రెడ్డి



పులివెందుల టౌన్, మన జనప్రగతి, అక్టోబర్ 04:- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని వైఎస్ మనోహర్ రెడ్డి, రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. పులివెందులలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో గ్రామ కమిటీ సభ్యులకు పార్టీ గుర్తింపు కార్డులను వైఎస్ మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పార్టీ కమిటీ సభ్యులు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో పార్టీ తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం ఉందని పేర్కొన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముని నాయుడు, రమేష్, శ్రీకాంత్, జనార్ధన్, బి. మోహన్, ఈశ్వరయ్య, ముని ప్రకాష్, శ్రీనివాసుల నాయుడు, రామాంజనేయులు అరటి, శ్రీను, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో పోలీసుల అవగాహన కార్యక్రమం

● మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ పురుషోత్తం రాజు



పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 04:- రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులకు సహకరించాలని పులివెందుల అర్బన్ సీఐ పురుషోత్తం రాజు సూచించారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి గ్రామంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.అదేవిధంగా సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలు, మోసపూరిత కాల్స్ ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.మహిళలు, బాలికల భద్రత కోసం అందుబాటులో ఉన్న పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య నూతన కమిటీకి ఘన సత్కారం

● మాదిగ ఉద్యోగుల సమస్యల పైన శక్తివంచన లేకుండా పని చేస్తాం

● మాదిగ ఉద్యోగుల నాయకులు



పులివెందుల టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 04:- మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మాదిగ ఉద్యోగుల నాయకులు పేర్కొన్నారు. పులివెందుల ప్రాంతానికి చెందిన జేసీ రామాంజనేయులు, రామసుబ్బయ్య, రవీంద్ర, గంగాధర్, రిగ్గర్ రవిలను మాదిగ ఉద్యోగుల సమాఖ్య కమిటీలో వివిధ బాధ్యతలకు నియమించిన సందర్భంగా పులివెందుల పట్టణంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మాదిగ ఉద్యోగులు నూతనంగా నియమితులైన నాయకులను దుశ్శాలువలు కప్పి, పూలగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. సమాఖ్య కమిటీలో బాధ్యతలు అప్పగించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన నాయకులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. మాదిగ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, సేవా సంబంధిత సమస్యల పరిష్కారంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పులివెందుల ప్రాంతానికి చెందిన మాదిగ ఉద్యోగులు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫైర్ రామక్రిష్ణ, రక్తనిధి రాజు, న్యాయవాది హరిప్రసాద్, అడవి రాముడు, శ్రీనివాసులు, రాజు, డాన్స్ రాజా, రవీంద్ర,తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ



పెనుకొండ, మన జనప్రగతి, అక్టోబర్ 04:- శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోనిపెంట, శెట్టిపల్లి, రాంపురం, ఎలమంచి పంచాయతీలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్న ఉషశ్రీ చరణ్, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచేలా నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు.కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన రైల్వే కోడూరు పోలీసులు



రైల్వే కోడూరు మన జనప్రగతి అక్టోబర్ 04:- కుటుంబ సమస్యల కారణంగా రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించిన 22 ఏళ్ల మహిళను రైల్వే కోడూరు పట్టణ పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. డయల్-100కు అందిన సమాచారంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకోవడంతో మహిళ ప్రాణాలు దక్కాయి.రైల్వే కోడూరు పట్టణంలోని బైపాస్ రోడ్డుకు చెందిన షేక్ సారా (22)కు కుటుంబ సమస్యలు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రైల్వే కోడూరు రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు డయల్-100కు సమాచారం అందింది.సమాచారం అందుకున్న రైల్వే కోడూరు పట్టణ పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న సారాను గుర్తించి, ఆమె రైలు కింద పడకుండా సకాలంలో రక్షించారు. అనంతరం పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి సమక్షంలో సారాను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన రైల్వే కోడూరు పట్టణ పోలీసుల చర్యను పలువురు అభినందించారు.ఆపదలో ఉన్నవారు లేదా ఎవరైనా ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన వెంటనే డయల్-100 లేదా 112కు సమాచారం అందించాలని రైల్వే కోడూరు పోలీసులు సూచించారు.

మైనర్ బాలికపై నేరం.. నిందితుడి అరెస్ట్

- జ్యుడీషియల్ కస్టడీకి తరలింపు



రైల్వే కోడూరు, అక్టోబర్ 4 (మన జనప్రగతి):

రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై జరిగిన నేరానికి సంబంధించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. పోలీసుల వివరాల మేరకు కేసు దర్యాప్తులో లభించిన ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 3న నిందితుడిని అరెస్ట్ చేశారు.అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన పోలీసులు ఆదివారం కోడూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి జ్యుడీషి యల్ కస్టడీకి తరలించారు. కేసులో శాస్త్రీయ ఆధారాలను సేకరించి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేస్తామని పోలీసులు తెలిపారు.మైనర్ బాలికకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, గుర్తింపును సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాధి తురాలి గోప్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

రైతు సంక్షేమంపై విమర్శలకు గణాంకాలతో సమాధానం

● వైసీపీ హయాంలో కంటే ఉద్యాన రంగంలో వృద్ధి: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, మన జనప్రగతి, అక్టోబర్ 04:- రైతు సంక్షేమం, రాయలసీమ అభివృద్ధిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన విమర్శలకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. కూటమి ప్రభుత్వం రైతులు, ఉద్యాన రైతుల కోసం పలు చర్యలు చేపట్టిందని తెలిపారు.గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు సమీకరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని మంత్రి చెప్పారు. ఉద్యాన రంగంలో 201924 మధ్య 9 శాతం వృద్ధి నమోదైతే, 202425లో 21 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు.మైక్రో ఇరిగేషన్‌లో 201419 మధ్య 5.9 లక్షల మంది రైతులకు 6.58 లక్షల హెక్టార్లలో సదుపాయం కల్పించగా, 201924 మధ్య 2.6 లక్షల మంది రైతులకు 2.9 లక్షల హెక్టార్లలో మాత్రమే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సబ్సిడీలను పునరుద్ధరించి మైక్రో ఇరిగేషన్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు.ధరలు పడిపోయిన సందర్భాల్లో రైతులను ఆదుకునేందుకు 202526లో రూ.300 కోట్లు ధరల స్థిరీకరణ నిధి కేటాయించగా, ఇప్పటికే సుమారు రూ.800 కోట్లు మద్దతు చర్యలకు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. పొగాకు, మామిడి, ఉల్లి, కోకో, టమాటా తదితర పంటలకు మార్కెట్ జోక్యం ద్వారా రైతులకు మద్దతు అందించామని చెప్పారు.పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రకృతి విపత్తుల పరిహారం విషయంలోనూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైసీపీ హయాంలో పరిహారం అందని 81 మంది రైతు కుటుంబాలకు రూ.5.67 కోట్లు చెల్లించామని, 202526లో రైతు కుటుంబాల పరిహారం కోసం రూ.22 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు.రైతు సంక్షేమంపై రాజకీయ విమర్శలు చేసే ముందు వాస్తవ గణాంకాలను పరిశీలించాలని, పంటలవారీగా ప్రభుత్వ చర్యలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛ జలం

- ప్రొద్దుటూరు నుంచి జల విప్లవానికి శ్రీకారం

- రూ.30,156 కోట్లతో 'జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార'కు రాష్ట్ర స్థాయి ప్రారంభోత్సవం

- 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లతో.. 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు చేకూరనున్న ప్రయోజనం

- రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా సోమవారం లాంఛనిక ప్రారంభం



కడప, మన జనప్రగతి అక్టోబర్ 04:- గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేస్తోంది. కోట్లాది మంది గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన 'జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార' కార్యక్రమానికి వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా సోమవారం రాష్ట్ర స్థాయిలో శ్రీకారం చుట్టనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై పైలాన్‌ను ఆవిష్కరించి పనులకు శంఖుస్థాపన చేయనున్నారు. **ఇది కేవలం తాగునీటి పథకం మాత్రమే కాదు..**గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే భారీ మౌలిక వసతుల నిర్మాణ కార్యక్రమం. రూ.30,156.12 కోట్ల అంచనా వ్యయంతో 50,315 పనులు చేపట్టడం ద్వారా రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు సైతం శాశ్వత నీటి వసతులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం.**ప్రతి ఇంటికీ కుళాయి.. ప్రతి కుటుంబానికీ సురక్షిత నీరు..**'హర్ ఘర్ జల్' లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్‌ను 2028 డిసెంబర్ వరకు పొడిగించింది. ప్రతి గ్రామీణ కుటుంబానికి వ్యక్తిగత కుళాయి కనెక్షన్ ద్వారా తలసరి రోజుకు 55 లీటర్ల సురక్షిత మంచినీరు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.రాష్ట్రంలో ఇప్పటికే 61.60 లక్షల కుటుంబాలకు, అంటే సుమారు 65 శాతం కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందాయి. మిగిలిన కుటుంబాలను కూడా వేగంగా కవరేజ్‌లోకి తీసుకురావడానికి ప్రభుత్వం భారీగా పనులు చేపడుతోంది.'అమరజీవి జలధార'లో భాగంగా 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. తద్వారా సుమారు 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.**రూ.30 వేల కోట్లకు పైగా పెట్టుబడి...**"జల జీవన్ మిషన్‌అమరజీవి జలధార" కింద చేపట్టే పనులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఎస్‌వీఎస్, పునరుద్ధరణ పనులకు రూ.9,068.94 కోట్లు, 32 ఎంవీఎస్ ప్రాజెక్టులకు రూ.19,462.39 కోట్లు, నీటి నాణ్యత పర్యవేక్షణ తదితర కార్యకలాపాలకు రూ.1,624.79 కోట్లు కలిపి మొత్తం రూ.30,156.12 కోట్ల పెట్టుబడితో 50,315 పనులు చేపట్టనున్నారు.ఇప్పటికే 27,301 పనులు పూర్తికాగా, రూ.5,587.01 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు సుస్థిరమైన నీటి సరఫరా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.**ప్రధాన జలాశయాల నుంచి గ్రామాలకు నీరు...**రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ ఎంవీఎస్ ప్రాజెక్టులను చేపడుతున్నారు. హిరమండలం, పీఏబీఆర్, వెలుగోడుఓంకారం, ధవళేశ్వరం, తాండవ, ఏలేరు, గండికోట వంటి ప్రధాన జలాశయాలు, నీటి వనరుల నుంచి నీటిని సేకరించి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నారు.రూ.10,320 కోట్లతో చేపట్టే 12 కీలక ఎంవీఎస్ ప్రాజెక్టుల ద్వారా 7,126 ఆవాసాల్లోని 88.68 లక్షల జనాభాకు ప్రయోజనం కలగనుంది. మరోవైపు రూ.3,297 కోట్లతో 8,494 ఎస్‌వీఎస్ పనులు చేపట్టనున్నారు.**వేల కిలోమీటర్ల పైపులైన్లు.. భారీ నీటి నిల్వ వ్యవస్థ...** అమరజీవి జలధార ద్వారా గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు భారీ మౌలిక వసతులు సమకూరనున్నాయి. ఇందులో భాగంగా 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు, 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించనున్నారు.ఇవి పూర్తయితే మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, నీటి కొరత ఎదుర్కొనే ప్రాంతాల్లోనూ ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే సామర్థ్యం రాష్ట్రానికి ఏర్పడుతుంది.**నీటి భద్రతతో గ్రామీణ జీవనంలో కొత్త మార్పు...**సురక్షిత తాగునీరు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ కుటుంబాలకు సమయం, శ్రమ ఆదా కావడమే కాకుండా మహిళలు, పిల్లలపై నీటి సేకరణ భారం తగ్గనుంది. నీటి నాణ్యత పర్యవేక్షణ, స్థానిక సమాజ భాగస్వామ్యం, వనరుల సుస్థిర నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా నీటి భద్రత కల్పించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.**ప్రొద్దుటూరు నుంచి రాష్ట్రానికి కొత్త భరోసా...**రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది గ్రామీణ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఈ భారీ కార్యక్రమానికి ప్రొద్దుటూరు వేదిక కావడం వైఎస్ఆర్ కడప జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ద్వారా 'ప్రతి ఇంటికీ నీరు.. ప్రతి కుటుంబానికి భరోసా' అనే ప్రభుత్వ లక్ష్యం మరింత వేగం అందుకోనుంది.ఈ బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, కూటమి ప్రభుత్వ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో ప్రొద్దుటూరు ప్రాంతం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకోనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ కుటుంబాలకు సురక్షిత తాగునీటిని అందించే మహత్తర లక్ష్యానికి ప్రొద్దుటూరు వేదికగా శ్రీకారం చుట్టడం ప్రజల్లో కొత్త ఆశలు, అభివృద్ధిపై మరింత నమ్మకాన్ని నింపనుంది. ప్రతి ఇంటికీ కుళాయి.. ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన నీరు అనే లక్ష్య సాధనలో 'జల జీవన్ మిషన్‌అమరజీవి జలధార' రాష్ట్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



ప్రొద్దుటూరు, మన జనప్రగతి, అక్టోబర్ 04:- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రొద్దుటూరులో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పర్యటన ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు.పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ కాన్వాయ్ మార్గాన్ని పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. విధుల్లో ఉన్న ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. కాన్వాయ్ రాకపోకలు, హెలిప్యాడ్, సభా వేదిక పరిసరాలు, మార్గాల్లో భద్రతా ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, ప్రొద్దుటూరు ఏఎస్పీ విబుకృష్ణ, ఐపీఎస్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్‌తో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

అమృత్‌నగర్‌లో రెండు హెలీప్యాడ్లు, జలజీవన్ మిషన్‌అమరజీవి జలధార లాంచింగ్ పైలాన్ పరిశీలన



ప్రొద్దుటూరు,మన జనప్రగతి అక్టోబర్ 04 : - రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ప్రోటోకాల్‌కు అనుగుణంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంయుక్తంగా అధికారులకు సూచించారు.ఆదివారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి ప్రొద్దుటూరు అమృత్‌నగర్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన రెండు హెలీప్యాడ్లను పరిశీలించారు. హెలీప్యాడ్ల వద్ద భద్రత, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ఇతర అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జలజీవన్ మిషన్‌అమరజీవి జలధార కార్యక్రమ లాంచింగ్ కోసం ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తదుపరి బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించిన మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు భద్రతా ఏర్పాట్లు, వీఐపీ గ్యాలరీలు, సభా వేదిక, ప్రజల గ్యాలరీలు, పార్కింగ్, రాకపోకల మార్గాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వైద్య సదుపాయాలు, పార్కింగ్, రవాణా తదితర సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీల వెంట పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. స్థానికంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, సభా ప్రాంగణానికి ప్రజల రాకపోకలకు సంబంధించిన అంశాలను అధికా రుల దృష్టికి తీసుకువచ్చారు.పర్యటనకు సంబంధించిన ప్రతి ఏర్పాటును సంబంధిత శాఖలు సమన్వయంతో పర్యవేక్షించాలని, ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, నాయకులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేవీ బస్సులు వెంటనే పునరుద్ధరించాలి

- కేవీ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్



కడప మన జనప్రగతి అక్టోబర్ 04: గత నెల 28వ తేదీ నుండి ఆర్టీసీ వారు కేంద్రీయ విద్యాలయ (కేవీ) బస్సులు నిలిపివేయడంతో అర్ధ సంవత్సర పరీక్షలు జరుగుతున్న సమయంలో 900 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారని కేవీ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది.అసోసియేషన్ ఉపాధ్యక్షులు వై. మల్లిఖార్జున రెడ్డి, ట్రెజరర్ వై. జితేంద్ర, సంయుక్త కార్యదర్శి పి. అనిల్ శాంసన్, కమిటీ సభ్యులు మురళీమోహన్, నాగార్జున, మునీంద్ర, జె. శేషాద్రి, విశ్వనాథ్, హుస్సేన్, ఎ. మధు, మహిళా విభాగం కన్వీనర్ శ్రీమతి జె. పద్మకళ, కమిటీ సభ్యులు శ్రీమతి ఫాతిమా, శ్రీమతి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.కడప పట్టణానికి 12 కి.మీ దూరంలో నిర్మానుష్య ప్రాంతమైన న్యూ రిమ్స్ వెనుక ఉన్న కేవీకి వెళ్లి రావడానికి రోజుకు మోటార్ బైక్ పెట్రోల్ కు రూ.150, ఆటోకు రూ.400 ఖర్చవుతోందని వాపోయారు. దాదాపు 250 మంది విద్యార్థులు ఒక్కొక్కరు కన్వేషన్ బస్ పాస్ కు రూ.3400 చెల్లించినా బస్సు సౌకర్యం కల్పించకపోవడం అన్యాయమన్నారు.గురువారం తల్లిదండ్రులు, విద్యార్థులు కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వ్రాతపూర్వకంగా విన్నవించగా, ఆయన ఆర్టీసీ ఆర్ఎం తో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఆర్టీసీ అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం కలెక్టరేట్ లో గ్రీవెన్స్ సెల్ రద్దు అయినా అందుబాటులో ఉన్న అధికారులకు మరోసారి విన్నవిస్తామని తెలిపారు. విద్యార్థుల భద్రతను, తల్లిదండ్రుల అవస్థలను అర్థం చేసుకొని గౌరవ జిల్లా కలెక్టర్ కేవీ చైర్మన్ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఎపిపిఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్యకు ఘన సన్మానం

అనంతపురం,మన జనప్రగతి అక్టోబర్ 04:-; ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఎపిపిఎస్ఎ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన దూదేకుల బాబయ్యను అనంతపురం పట్టణంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యా రంగానికి చెందిన మిత్రులు బాబయ్యను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎపిపిఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాబయ్య ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలను రాష్ట్ర స్థాయిలో సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, విద్యా రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఎపిపిఎస్ఎ నాయకత్వానికి, తనను అభినందించిన జిల్లా వ్యాప్తంగా ఉన్న కరస్పాండెంట్ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యా రంగ ప్రతినిధులు పాల్గొని దూదేకుల బాబయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



30 ఏళ్లుగా నిరుపేదలకు వెంకటసుబ్బయ్య సేవలు

సేవా రత్న అవార్డుతో గౌరవించాలి

ప్రభుత్వ సాయం లేకుండానే ఆశ్రమ నిర్వహణ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లి మన జనప్రగతి అక్టోబర్ 04: వేంపల్లికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, 'అమ్మ' అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు దేరంగుల వెంకటసుబ్బయ్య గత 30 ఏళ్లుగా నిరుపేదలు, అనాథలు, వృద్ధులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆయన సేవలను గుర్తించి సేవా రత్న అవార్డుతో గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం వేంపల్లి రాజీవ్ కాలనీలోని 'అమ్మ' అనాథ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు వెంకటసుబ్బయ్య సంస్థ తరఫున దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ.. మానవసేవయే మాధవసేవ, పరుల సేవయే పరమాత్ముని సేవ, ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న అన్న మదర్ థెరిసా సేవా స్ఫూర్తిని వెంకటసుబ్బయ్య ఆచరణలో చూపిస్తున్నారని కొనియాడారు.మానవత్వం రోజురోజుకూ తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నిస్వార్థ సేవాభావంతో పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య వంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తులసిరెడ్డి అన్నారు. పేద



కుటుంబానికి చెందిన వెంకటసుబ్బయ్య ప్రభుత్వ సహకారం లేకుండా కేవలం దాతల సహకారంతో మూడు దశాబ్దాలుగా అనాథలు, వృద్ధులకు ఆశ్రమంలో వసతి, ఆహారం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు.ఇలాంటి సేవా తత్పరులను సమాజం, ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వెంకటసుబ్బయ్య సేవా రత్న అవార్డుకు అన్ని విధాలా అర్హుడని, ఆయన సేవలను మండల, జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సేవా రత్న అవార్డుతో సత్కరించేందుకు కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.**అన్నదానం.. దాతల సేవలు** రాయచోటికి చెందిన కీర్తిశేషులు మాసగాని రామచంద్రయ్య, నారాయణమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తెలు సునంద, మాధవి 'అమ్మ' అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని సంస్థ తరఫున తులసిరెడ్డి సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వేంపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, చిన్నకోట్ల నాగరాజు, మహీధర్ తేజ తదితరులు పాల్గొన్నారు.**భారత క్రికెట్, హాకీ జట్లకు తులసిరెడ్డి అభినందనలు** ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాల విజయం గర్వకారణం..ఆసియా క్రీడల్లో భారత పురుషుల క్రికెట్, హాకీ జట్లు అద్భుత విజయం సాధించి బంగారు పతకాలు కైవసం చేసుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. దేశానికి గర్వకారణంగా నిలిచిన భారత క్రీడాకారులను ఆయన అభినందించారు. వారి విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

కార్యకర్తల భద్రతకు భరోసా.. పార్టీ బలోపేతానికి పిలుపు

నాగేళ్ల సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో ఐడీ కార్డుల పంపిణీ

రూ.5 లక్షల ప్రమాద బీమాతో ఆర్థిక రక్షణ

చాగలేరు,వి.కొత్తపల్లిలో పార్టీ శ్రేణుల సందడి

వేముల మన జనప్రగతి అక్టోబర్ 04:వైఎస్సార్‌సీపీ కార్యకర్తల భద్రత,సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో చాగలేరు,వి.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పార్టీ కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు కల్పించడంతో పాటు,వారికి ఆర్థిక భరోసా కల్పించే చర్యల్లో భాగంగా ప్రమాద బీమా సదుపాయాన్ని అందిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.**కార్యకర్తలే పార్టీకి ముఖ్య బలగం** ఈ సందర్భంగా నాగేళ్ల సాంబశివరెడ్డి మాట్లాడుతూ..రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న కార్యకర్తలే పార్టీకి ముఖ్య బలగమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొకటం వెంకట బయపురెడ్డి, మాజీ పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, ఎంపీపీ చల్ల గంగాదేవి వెంకట నారాయణ పాల్గొని కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు.**రూ.5 లక్షల ప్రమాద బీమాతో ఆర్థిక**





భరోసా కార్యకర్తల సంక్షేమంలో భాగంగా రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించడం ద్వారా వారికి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అనుకోని ప్రమాదం జరిగిన సమయంలో బీమా సాయం కుటుంబానికి ఆర్థికంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యమని స్పష్టం చేశారు.**స్థానిక ఎన్నికలకు సమన్వయంతో సిద్ధం కావాలి..!** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు ఐకమత్యంతో, సమన్వయంతో సిద్ధం కావాలని నాగేళ్ల సాంబశివరెడ్డి పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త చురుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యకర్తల ఐక్యత, సమష్టి కృషి పార్టీ కార్యక్రమాలకు కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చందా మల్‌రెడ్డి,మాజీ ఎంపిటిసి చంద్రారెడ్డి, జిల్లా విభజన విభాగం అధ్యక్షులు చల్లా సునీల్ కుమార్,గండి పాలకవర్గ సభ్యులు చెల్లుబోయిన రెడ్డయ్య,మాజీ సర్పంచ్ శ్రీనివాసులు,గండి పాలకమండలి సభ్యులు పీబీవీ కొండారెడ్డి,మాజీ ఉపసర్పంచ్ పోరెడ్డి రాఘవరెడ్డి,వెంకట సుబ్బారెడ్డి, కె.వి రమణ,వెంకటస్వామి,అర్జున్,ఉత్తయ్య, కమ్మటి హరినాథ్,చాగలేటి రవిశంకర్,తో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పత్తికొండలో రౌడీ రాజ్యాన్ని సహించం

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

రవిచంద్రకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం

సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్:దాడులకు ఎర్రజెండా ఎప్పటికీ భయపడదు

పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 04:– పత్తికొండలో రౌడీ రాజ్యం చేయాలనుకుంటే సీపీఎం పార్టీ సహించబోదని ఆ పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ హెచ్చరించారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్రపై జరిగిన దాడికి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆదివారం పత్తికొండలోని ఈశ్వర్‌రెడ్డి కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో గౌస్ దేశాయ్ మాట్లాడారు. పత్తికొండలో రోడ్ల విస్తరణ చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.రోడ్ల విస్తరణలో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్



1న ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన బాధాకరమన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని నిరసన చేపట్టారని తెలిపారు.అయితే నిరసనలో పాల్గొన్న వారందరినీ వదిలి సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్రను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, ముఖాలకు ముసుగులు ధరించిన వ్యక్తులు దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని గౌస్ దేశాయ్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న నాయకులపై దాడులు చేయడం ద్వారా ఉద్యమాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. దాడులకు భయపడి సీపీఎం వెనక్కి తగ్గబోదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు.దాడి జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నందున వాటి ఆధారంగా నిందితులను పోలీసులు త్వరితగతిన గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రవిచంద్రకు న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని గౌస్ దేశాయ్ హెచ్చరించారు.ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, సీఐటీయూ మండల అధ్యక్షుడు గోపాల్, మద్దికెర అధ్యక్షుడు రాముడు, ప్రజానాట్యమండలి జిల్లా, మండల నాయకులు రమేష్, శివశంకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెయ్యికి పైగా వాహనాలతో శంషాబాద్‌కు శంకర్ భారీ ర్యాలీ

● శంకర్ ఆధ్వర్యంలో కదిలిన కాంగ్రెస్ దండు.. షాద్‌నగర్ దద్దరిల్లే ● ఓబీసీ సభకు షాద్‌నగర్ నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

షాద్ నగర్,మన జనప్రగతి అక్టోబర్ 04: షాద్‌నగర్ నుంచి శంషాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ మహా బహిరంగ సభకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. వెయ్యికి పైగా వాహనాలతో భారీ ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు కాంగ్రెస్ నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు. ముందుగా చౌడమ్మగుట్టలో ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం పట్టణ కూడలికి చేరుకున్న ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ నినాదాలు చేశారు.ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సామాజిక, రాజకీయ అభివృద్ధికి కులగణన ఎంతో కీలకమన్నారు. బీసీ కులగణన చేపట్టే వరకు కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సభకు భారీగా తరలివచ్చిన ఓబీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, అగ్గనూర్ బసవేశ్వర్, అందే మోహన్, కేకే కృష్ణ, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు జీవో 641 రద్దు చేయాలి

- నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్ నగర్,మన జనప్రగతి అక్టోబర్ 04:సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమకారులకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ విజయ్ హాజరుకాగా, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... డంపింగ్ యార్డు ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, భూగర్భ జలాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల కాలుష్య సమస్యలు ఉన్నాయని, ప్రజలకు నష్టం కలిగించే డంపింగ్ యార్డు ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలకు గౌరవం ఇచ్చి జీవో 641ను రద్దు చేయాలని, ప్రజల న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సామాజికవేత్త వనమాల, జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టుతో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం

- మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్



మహబూబాబాద్ మన జనప్రగతి అక్టోబర్ 04:సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతో నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్ అన్నారు. ఆదివారం వైరా నియోజకవర్గం కారేపల్లి మండలం చీమలపాడు గ్రామంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి సీతారామ ప్రాజెక్టును పరిశీలించారు.ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణం, నీటి ప్రవాహం, ఇల్లందు నుంచి మహబూబాబాద్ నియోజకవర్గానికి నీటిని తరలించే అవకాశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు నీటిని సమర్థవంతంగా వినియోగిస్తే రెండు నియోజకవర్గాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్‌నాయక్, మూల మధుకర్‌రెడ్డి, వేలపుల శ్రీనివాస్, నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వారం రోజులుగా కేంద్రీయ విద్యాలయకు బస్సులు నిలిపివేత

● అవస్థలు పడుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు ● కేవీ బస్సులు వెంటనే పునరుద్ధరించాలి - కేవీ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్



కడప మన జన ప్రగతి అక్టోబర్ 2:గత నెల 28వ తేదీ నుండి ఆర్టీసీ వారు కేంద్రీయ విద్యాలయ (కేవీ) బస్సులు నిలిపివేయడంతో అర్ధ సంవత్సర పరీక్షలు జరుగుతున్న సమయంలో 900 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారని కేవీ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. అసోసియేషన్ ఉపాధ్యక్షులు వై. మల్లిఖార్జున రెడ్డి, ట్రెజరర్ వై. జితేంద్ర, సంయుక్త కార్యదర్శి పి. అనిల్ శాంసన్, కమిటీ సభ్యులు మురళీమోహన్, నాగార్జున, మునీంద్ర, జె. శేషాద్రి, విశ్వనాథ్, హుస్సేన్, ఎ. మధు, మహిళా విభాగం కన్వీనర్ శ్రీమతి జె. పద్మకళ, కమిటీ సభ్యులు శ్రీమతి ఫాతిమా, శ్రీమతి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.కడప పట్టణానికి 12 కి.మీ దూరంలో నిర్మానుష్య ప్రాంతమైన న్యూ రిమ్స్ వెనుక ఉన్న కేవీకి వెళ్లి రావడానికి రోజుకు మోటార్ బైక్ పెట్రోల్ కు రూ.150, ఆటోకు రూ.400 ఖర్చవుతోందని వాపోయారు. దాదాపు 250 మంది విద్యార్థులు ఒక్కొక్కరు కన్వేషన్ బస్ పాస్ కు రూ.3400 చెల్లించినా బస్సు సౌకర్యం కల్పించకపోవడం అన్యాయమన్నారు.గురువారం తల్లిదండ్రులు, విద్యార్థులు కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వ్రాతపూర్వకంగా విన్నవించగా, ఆయన ఆర్టీసీ ఆర్ఎం తో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఆర్టీసీ అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం కలెక్టరేట్ లో గ్రీవెన్స్ సెల్ రద్దు అయినా అందుబాటులో ఉన్న అధికారులకు మరోసారి విన్నవిస్తామని తెలిపారు. విద్యార్థుల భద్రతను, తల్లిదండ్రుల అవస్థలను అర్థం చేసుకొని గౌరవ జిల్లా కలెక్టర్ కేవీ చైర్మన్ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

వేంపల్లె వృషభాద్రికి రూ. 2 కోట్ల సిజిఎఫ్ నిధులు ఇవ్వండి.

● దేవాదాయ శాఖ మంత్రిని కోరిన చైర్మన్, ఈవో ● వచ్చే సమావేశంలో చర్చించి నిధులు ఇస్తామన్న మంత్రి ఆనం



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 04: - వేంపల్లె ఎద్దుల కొండ వృషభాచలేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్ల సిజిఎఫ్ నిధులు ఇవ్వాలని ఆలయ కమిటీ చైర్మన్ పి.వెంకట రమణ, ఈవో కడప సుభాష్ లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. ఈ మేరకు వారు ఆదివారం నెల్లూరు కు వెళ్లి మంత్రి స్వగృహంలో ఆయనను కలిసి ఆయన్ను ఘనంగా సత్కరించి వేదా ఆశీర్వాదాలు అందజేసి నిధుల మంజూరు కోసం వినతిపత్రం సమర్పించారు. వేంపల్లి లోని పవిత్ర పాపాగ్ని నదీ తీరాన 2వేల అడుగుల ఎత్తులో ఉన్న ఎద్దుల కొండపై 500 ఏళ్ల క్రితం జనమేజేయుని కాలంలో నిర్మించిన ఎద్దులకొండ్రాయుడు స్వామి ఆలయం ఎంతో పురాతనమైనదన్నారు. ఈ ఆలయంలో వెలసిన వృషభాచలేశ్వర స్వామి కడప, అన్నమయ్య, శ్రీ సత్య సాయి,అనంతపురం జిల్లాలోని పలు కుటుంబాలకు ఇలవేల్పుగా ఉన్నారన్నారు. ఇంతటి చారిత్రక నేపథ్యం ఉన్న ఆలయం చుట్టూ ప్రాకార నిర్మాణం లేక స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ భక్తులకు ప్రమాదం పొంచి ఉందని వారు పేర్కొన్నారు. ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మాణానికి రూ. 2 కోట్లు నిధులు అవసరమని, ఆ మేరకు దేవాదాయ శాఖ అధికారులు ఎస్టిమేషన్లు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపారన్నారు. ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మాణానికి సిజిఎఫ్ నిధుల కోసం 20 శాతం వాటా కింద తమ దేవస్థానం నుంచి రూ 40 లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు మంత్రికి తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రి ఆనం వేంపల్లి వృషభాద్రికి నిధులు మంజూరు విషయమై వచ్చే సిజిఎఫ్ సమావేశంలో చర్చించి ఖచ్చితంగా నిధులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలకమండలి సభ్యుడు నాగిశెట్టి సునీల్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు హరిప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

● ఉపాధ్యాయుల పాత్ర సమాజ నిర్మాణంలో కీలకం: రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి



కడప మన జన ప్రగతి అక్టోబర్ 04:-ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (అప్పుస్మా) కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం2026' ఘనంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, జ్ఞానాన్ని పెంపొందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిరంతరం శ్రమిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు.అనంతరం వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచంద్రారెడ్డి, అప్పుస్మా జిల్లా అధ్యక్షుడు బి. గంగయ్య, శివ శంకర్ రెడ్డి, రమణారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. షంషుద్దీన్, అప్పుస్మ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు అభివృద్ధికి రూ.3.1 కోట్ల పనులకు శ్రీకారం

● డబుల్ ఇంజన్ స్పీడుతో అభివృద్ధి: మంత్రి నారాయణ



నెల్లూరు, మన జనప్రగతి, అక్టోబర్ 04:- నెల్లూరు నగరంలోని పలు డివిజన్లలో రూ.3.1 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం శ్రీకారం చుట్టారు. సచివాలయ భవనాలు, సీసీ రోడ్లు, పార్కుల ప్రహరీలు, గ్రీనరీ పనులకు శంకుస్థాపనలు చేశారు.11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో రూ.కోటితో నిర్మించనున్న సచివాలయ భవనం, రూ.30 లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 10వ డివిజన్ ఎన్‌డీఆర్ లేఅవుట్‌లో రూ.70 లక్షలతో నిర్మించనున్న సచివాలయ భవనం, 45వ డివిజన్ మినీబైపాస్‌లో రూ.80 లక్షలతో చేపట్టనున్న గ్రీనరీ పనులకు శ్రీకారం చుట్టారు. 42వ డివిజన్‌లో హుడా మసీదు వద్ద రూ.18 లక్షలు, ఎర్రదర్గా రోడ్డులో రూ.12 లక్షలతో చేపట్టనున్న నీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.50 వేల కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నెల్లూరు నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ.61 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే ఏడాది జూన్ 12 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.నెల్లూరు సిటీ ప్రజలకు ఇచ్చిన హామీలను 2028 జూన్ 12 నాటికి నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అధికారులు, కార్పొరేటర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలి: మెట్టు శ్రీధర్



హైదరాబాద్ మన జనప్రగతి అక్టోబర్ 04:- రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు జర్నలిస్టులు వెన్నెముకలాంటివారని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం తగిన భద్రత, సంక్షేమ సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు కేటాయించాలని, వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య సదుపాయాలు అందేలా ప్రత్యేక ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. అలాగే అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు జాప్యం లేకుండా అందించాలని అన్నారు.ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా రంగాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వారికి కనీస వేతన భద్రత, ఉద్యోగ భద్రత, పెన్షన్, బీమా వంటి సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకరుల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉందని, వారికి ప్రత్యేక గుర్తింపు, సంక్షేమ నిధులు, అత్యవసర సహాయ పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే పథకాలు కూడా ప్రవేశపెట్టాలని సూచించారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని మెట్టు శ్రీధర్ కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాద సంస్థలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాన్ని చేపట్టి జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

13 లోగా ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలు పొందండి

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉషశ్రీ



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 04:స్థానిక వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి. ఆర్ . అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి ఈనెల 13 లోగా డిగ్రీలో ప్రవేశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. ఉషశ్రీ పేర్కొన్నారు. వేంపల్లిలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలోని అంబేద్కర్ స్టడీ సెంటర్లో బి.ఎ, బి.కాం, బి.ఎస్సీ, బి.లిబ్ కోర్సులకు ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ లేదా 3 ఏళ్ల డిప్లొమా పూర్తి చేసిన వారు ఈ డిగ్రీ ప్రవేశాలకు అర్హులని ఆమె తెలిపారు. ప్రవేశాలకు వయసు పరిమితి లేదన్నారు. బి.ఏ లో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బి.ఎస్సీలో ఎంపీసీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బి.కాం కంప్యూటర్స్, బి. లిబ్ లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈప్రవేశాలకు ఆఖరి తేదీ ఈ నెల 13 అని ఆమె తెలియజేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు . ఇతర పూర్తి వివరాలకు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నాగేంద్ర ను కానీ 94919 47599, 94940 81882 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె కోరారు.

నిడదవోలులో 205 మందికి రూ.1.02 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం



నిడదవోలు, అక్టోబర్ 4 (మన జనప్రగతి): పేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు కాపు కళ్యాణ మండపంలో ఆదివారం 205 మంది లబ్ధిదారులకు రూ.1,02,82,199 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను పంపిణీ చేశారు.ఇందులో 198 మందికి రూ.76,73,564 విలువైన చెక్కులు, ఏడుగురికి రూ.26,08,635 విలువైన ఎల్ఓసీలు అందించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా 1,382 మందికి రూ.9.07 కోట్లకుపైగా లబ్ధి చేకూర్చినట్లు మంత్రి తెలిపారు. తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదాల సమయంలో సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174